

ఆచూకీ.. ఏదీ..?

- రాష్ట్రంలో కలకలం రేపుతున్న పిల్లల కిడ్నాప్‌లు
- ఏటా 400 మంది చిన్నారుల అపహరణ
- కన్నబిడ్డలు కానరాక తల్లిదండ్రుల ఆవేదన
- భిక్షాటన, వేశ్యాగృహాలకు తరలిస్తున్న ముఠాలు
- రాజధాని బెంగళూరులోనే అత్యధికం



బెంగళూరు, జూన్ 1(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో చిన్నారుల కిడ్నాప్‌లు బెంబేలెత్తిస్తున్నాయి. ఇంటిముందు ఆటలాడుతుండగానే కనిపించకుండా పోతారు, పాఠశాలకు వెళ్లినవారు తిరిగి రారు. ఇక పార్కులు, బస్టాండ్‌ల్లో ఒంటరిగా కనిపిస్తే వారు గల్లంతైనట్లే. ఇలా ఏటా చిన్నారుల కిడ్నాప్‌లు పెరిగిపోతున్నాయి. ఒకరు కాదు ఇద్దరు కాదు... ఏటా వందలాదిమంది చిన్నారుల ఆచూకీ కానరాకుండా పోతోంది. వీరంతా ఎక్కడికి వెళ్తున్నారు, ఏమవుతున్నారనేది దశాబ్దాలకాలంగా అంతుచిక్కని రహస్యంగా ఉంది. ప్రమాదమో లేదా జబ్బు బారినపడి మృత్యువాత చెందితే తల్లిదండ్రులు కొన్నేళ్లపాటు మనోవేదన చెంది మరచిపోతారు. కానీ కళ్లముందు ఎదుగుతున్న చిన్నారులు కనిపించకుండా పోవడంతో వారు ఎక్కడైనా ఉంటారని, ఎప్పుడైనా వెనుదిరిగివస్తారని, మమ్మల్ని గుర్తు పడతారని ఎదురుచూస్తున్న కుటుంబీకులు రాష్ట్రంలోని ప్రతి వీధిలోనూ దర్శనమిస్తారు. పిల్లాడు లేదా పాప తప్పించుకుపోయారంటే ఇక కుటుంబీకులంతా పోలీస్‌స్టేషన్‌లు, గాలింపులకే పరిమితమయ్యే పరిస్థితి ఏర్పడింది. బాల కార్మికులను గుర్తించేందుకు ప్రత్యేక దాడులు జరిపే పోలీసులు కిడ్నాప్ అయిన చిన్నారుల కేసులను చేధించిన సంఘటనలు అంతంతమాత్రమే అనిపిస్తుంది.

రాష్ట్రంలో చిన్నారుల కిడ్నాప్‌ల సంఖ్య పెరిగిపోతోంది. 2020 నుంచి 2024 వరకు రాష్ట్రంలో 12,790 మంది చిన్నారులు కిడ్నాప్ అయ్యారు. వీరిలో 1334మంది ఆచూకీ లభించలేదు. వీరు ఎక్కడికి వెళ్లారనేందుకు సమాధానం ఉండదు. కిడ్నాప్‌కు గురైన చిన్నారు తల్లిదండ్రులు పోలీసుల చుట్టూ తిరగడమే కానీ వారికి తగిన సమాధానం ఎక్కడా లభించడం లేదు. కిడ్నాప్‌లలో బెంగళూరు నగర జిల్లా రాష్ట్రంలోనే ప్రథమ స్థానంలో ఉంది. ఆ తర్వాతి స్థానాలు దక్షిణ కర్ణాటక జిల్లాలు మండ్య, మైసూరు, చామరాజనగర, కొడగు, చిక్కమగళూరు, దావణగెరె శివమొగ్గ, దక్షిణకన్నడ, ఉడుపి, ఉత్తరకన్నడ టాప్ 10లో ఉన్నాయి.

ఏటా 400మంది చిన్నారుల కిడ్నాప్

బెంగళూరుతోపాటు అభివృద్ధి చెందుతున్న నగరాలలో చిన్నారుల కిడ్నాప్‌లు సవాల్‌గా మారుతున్నాయి. అధికారిక గణాంకాల ప్రకారమే ఏటా 400 మంది చిన్నారులు కిడ్నాప్ అవుతున్నట్లు తెలుస్తోంది. 2021లో 560మంది, 2022లో 427మంది, 2023లో 469మంది, 2024లో 472మంది కిడ్నాప్‌కు గురైనట్లు కేసులు ఉన్నాయి. కేసులు నమోదు కాని సంఘటనలు కోకొల్లలుగానే ఉన్నాయి. ఇందులో కేసులు చేధించబడినవి కొన్నే ఉన్నాయి.

కారణాలేంటి?

ఆధునిక సమాజంలో చిన్నారులు బయటప్రపంచంలో జరుగుతున్న పలు అంశాలకు త్వరితగతిన ఆకర్షితులవుతారు. ఒకే ఆలోచన కల్గిన చిన్నారులు మిత్రులు అవుతారు. కుటుంబాలలో పేదరికం, చిన్న వయస్సులోనే ప్రేమ, చదువుపట్ల ఆసక్తిలేకపోవడం, చంచలమనస్సు కలిగి ఉండడం వంటివి కారణాలు. ఇలా చిన్నారులు కుటుంబ సభ్యులకు దూరమై ధూమపానం, మద్యపానం వంటి అలవాట్లకు పడేవారిని పసిగట్టి కిడ్నాప్ చేసేవారు ఉన్నారు. మరోవైపు పాఠశాలలు, ట్యూషన్‌కు వెళ్లిన సమయంలోనూ కనిపించకుండా పోతున్నారు. ఇటువంటి వారిని గుర్తించి ఇతర ప్రాంతాలకు తీసుకెళ్లి విక్రయించే సంఘటనలు ఉన్నాయి. మధ్యవర్థుల చేతిలో చిక్కి వేశ్యావాటికలపాలవుతున్నారు. కొందరు వెట్టిచాకిరీకి లోనవుతుండగా మరికొన్ని కిరాతక ముఠాలు అవయవాల విక్రయానికి ఇలాంటి వారిని వాడుకుంటున్నారు. భిక్షాటనతోపాటు అమానుషమైన చర్యలకు వీరిని వినియోగిస్తున్నారు. రాష్ట్రంలో వీటి వెనుక పెద్ద నెట్‌వర్క్ పనిచేస్తున్నట్లు అనిపిస్తోంది.

2020-2024 వరకు కిడ్నాప్‌కు గురైనవారిలో బాలురు 3,529 కాగా పూర్తిగా కనిపించకుండా పోయినవారు 362మంది. బాలికల్లో 9,261 మంది కిడ్నాప్ కాగా 972మంది ఆచూకీ లభించలేదు. కిడ్నాప్ లేదా ఇంటినుంచి పరారైపోయినవారిలో 10.43శాతంమంది ఆచూకీ లేకుండా పోతోంది. మిగిలిన సుమారు 90శాతం మంది దొరికిపోతున్నారు. ఇటీవలికాలంలో రైల్వే, సివిల్ పోలీసులు ప్రత్యేక నిఘా పెట్టారు. పెద్దలు లేకుండా చిన్నారులు మాత్రమే ఎక్కడైనా కనిపిస్తే వెంటనే వారిని అదుపులోకి తీసుకుని తల్లిదండ్రులకు సమాచారం ఇస్తున్నారు. ఇటవంటి కేసులు ప్రతి జిల్లాలోనూ కొనసాగుతున్నాయి. ప్రత్యేకించి సీసీ కెమెరాలు ఉండడంతో చిన్నారులు ఎక్కడికి వెళ్లారు, ఎవరిని పట్టుకెళ్లారనేది గుర్తించేందుకు వీలుంది.

ఎలా అరికట్టాలి..?

చిన్నారుల కిడ్నాప్‌లు లేదా పరారైన చిన్నారులను గుర్తించేందుకు కేవలం ఒక రాష్ట్రానికి చెందిన పోలీసులతో చేధించడం కష్టతరమే. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేయాలి. పొరుగు రాష్ట్రాలలో చిన్నారులు కిడ్నాప్‌పై నిరంతరంగా నిఘా ఉండాలి. పొరుగు రాష్ట్రాలతో కలసి సమన్వయంతో దాడులు జరిపితే కొంతమేర అరికట్టేందుకు వీలుంది.

చిన్నారుల హక్కుల రక్షణ కమిషన్ సభ్యుడు శశిధర్ కోసంబె అభిప్రాయం ప్రకారం విశ్వసంస్థలో చిన్నారుల హక్కుల ఒడంబడిక తరహాలోనే బాలల హక్కుల రక్షణ కూడా ప్రధానమైనది. 18 ఏళ్లు నిండే వరకు కుటుంబం, సమాజం ద్వారా గౌరవంగా జీవించాలి. ఇందుకు స్త్రీ శిశుసంక్షేమశాఖ మాత్రమే కాకుండా అన్నిశాఖలు సమన్వయంగా పనిచేయాల్సి ఉంటుంది. అప్పుడే తప్పిపోతున్న చిన్నారుల ఆచూకీని తెలుసుకునేందుకు వీలుటుంది.

కమల్‌కు మద్దతిచ్చేవారంతా

కన్నడ ద్రోహులే..!

- సాహితీవేత్త చంద్రు ఆగ్రహం
- చప్పట్లు కొడితే సమర్థించినట్లు కాదు: నటుడు శివరాజ్ కుమార్



చంద్రు

బెంగళూరు, జూన్ 1(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో కమల్ వివాదం కొనసాగుతోంది. నటుడు కమల్ హాసన్ 'థగ్‌లైఫ్' సినిమా ప్రి రిలీజ్ ఈవెంట్‌లో కన్నడ భాష పట్ల చేసిన వ్యాఖ్యలపై సర్వత్రా వ్యతిరేకత వ్యక్తం అవుతోంది. ఈనెల 5న థగ్ లైఫ్ సినిమా విడుదల కానుంది. ఈలోగా కమల్‌హాసన్ క్షమాపణ చెప్పకుంటే సినిమా విడుదలను అడ్డుకుంటామని కర్ణాటక రక్షణా వేదిక (కరవే) హెచ్చరించింది. మరోవైపు కన్నడ చలన చిత్ర వాణిజ్యమండలి అధ్యక్షుడు నరసింహులు, కన్నడ సాంస్కృతిక శాఖ మంత్రి శివరాజ్ తంగడగికి సినిమాను అడ్డుకోవాలని లేఖ పంపారు. అయితే సినిమాను ప్రదర్శనకు సిద్ధమైన డిస్ట్రిబ్యూటర్‌లు, నిర్మాత డోలాయమానంలో పడ్డారు. కన్నడ సాహితీవేత్త, ఆప్ పార్టీ ముఖ్యనేత ముఖ్యమంత్రి చంద్రు ఆదివారం బెంగళూరులో తీవ్రంగా మండిపడ్డారు. కన్నడ పట్ల అనుచితంగా మాట్లాడిన కమల్‌హాసన్ దురహంకారి, అయోగ్యుడన్నారు. అదే కార్యక్రమంలో పాల్గొన్న శివరాజ్‌కుమార్ వెంటనే ఖండించాల్సి ఉండేదన్నారు. కమల్‌హాసన్‌కు మద్దతు ఇచ్చేవారంతా కన్నడ ద్రోహులన్నారు. సినిమా విడుదల చేయకుంటే డిస్ట్రిబ్యూటర్లు నష్టపోతారన్నారు. కమల్‌హాసన్ కర్ణాటకలోకి రాకుండా అడ్డుకోవాలన్నారు.

కన్నడ నటుడు కిశోర్ మాత్రం కమల్‌హాసన్‌కు మద్దతు ఇచ్చేలా మాట్లాడారు. భాష ఎలా పుట్టిందనేది సమగ్ర సమాచారం లేదని, అందుకు కమల్‌వ్యాఖ్యలు తప్పేమీ కాదన్నారు. తన తల్లి నుంచి తాను పుట్టానంటే అది తల్లికి అవమానం చేసినట్లు కాదన్నారు. ఎందుకు ఇలా భావిస్తున్నారో తెలియదన్నారు. ఓ సిద్ధాంతం ప్రకారం అది నిజమై ఉండవచ్చునన్నారు. కాగా సినిమా విడుదలను బ్యాన్ చేయలేమని నిర్మాత మంజు అభిప్రాయపడ్డారు. డిమాండ్లకు అనుగుణంగా నిర్ణయాలు అసాధ్యమన్నారు. ఇది రెండు రాష్ట్రాల మధ్య వివాదం కాదన్నారు. కొందరు 'థగ్‌లైఫ్'ను మాత్రమే అడ్డుకోవాలని కోరుతుండగా మరికొందరు తమిళ సినిమాలన్నింటీ బ్యాన్ చేయాలని డిమాండ్ చేస్తున్నారన్నారు. అన్నింటినీ పరిశీలించాల్సి ఉంటుందన్నారు. దావణగెరెలో మాజీ న్యాయమూర్తి సంతోష్‌హెగ్డే మాట్లాడుతూ కర్ణాటకలో పుట్టిన కమల్‌హాసన్ తమిళం పట్ల అభిమానం తప్పు కాదని, కానీ కన్నడ పట్ల వ్యాఖ్యలు విషాదకరమన్నారు. నటుడు శివరాజ్‌కుమార్‌పైనా పలువురు విమర్శలు చేస్తున్న తరుణంలో ఆయన స్పందించారు. కమల్‌హాసన్ వ్యాఖ్యలను తాను సమర్థించడం లేదన్నారు. భాష గురించి మాట్లాడుతున్నప్పుడు చప్పట్లు కొట్టానని, అయితే ఆయన ఏం మాట్లాడారో అర్థం కాలేదన్నారు. స్టేజీపై ఉన్నప్పుడు విమర్శించేందుకు తనకు అర్థం కాలేదన్నారు. కన్నడ భాషకు మద్దతులో వెనక్కి తగ్గేది లేదన్నారు.



శివరాజ్‌కుమార్

ఇద్దరు మైనార్టీ సెల్ నేతలకు నోటీసులు

- దక్షిణకన్నడ జిల్లాలో ప్రత్యేక సెల్ ఏర్పాటుపై అధిష్టానం ఆగ్రహం



బెంగళూరు, జూన్ 1(ఆంధ్రజ్యోతి): దక్షిణకన్నడ జిల్లాలో ముస్లింలపై దౌర్జన్యాలు జరుగుతున్నాయని జిల్లా కాంగ్రెస్ మైనారిటీ సెల్ ఏర్పాటు చేయడాన్ని కాంగ్రెస్ పార్టీ తీవ్రంగా పరిగణించింది. పార్టీ అగ్రనాయకులతో, జిల్లా ఇన్‌చార్జ్ మంత్రులతో చర్చించకనే సభ ఏర్పాటు చేయడంపై మండిపడింది. ఈమేరకు శనివారం దక్షిణకన్నడ జిల్లా కాంగ్రెస్ మైనారిటీసెల్ అధ్యక్షుడు కేకే షాహుల్ హమీద్, మాజీ మేయర్ అష్రఫ్‌లకు జిల్లా కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి వికాస్‌శెట్టి నోటీసులు జారీ చేశారు. వారం రోజుల్లో వివరణ ఇవ్వాలని సూచించారు. బంట్వాళలో అబ్దుల్ రహీం హత్య తర్వాత మైనారిటీలకు కాంగ్రెస్ ప్రభుత్వంలో అన్యాయం జరుగుతోందని సభ ఏర్పాటు చేశారు. మూకుమ్మడిగా పార్టీ పదవులకు రాజీనామా చేయాలని తీర్మానించారు. ఈ అంశాన్ని పార్టీ అధిష్ఠానం తీవ్రంగా పరిగణించింది.

వర్ష ప్రభావిత ప్రాంతాల్లో డ్రోన్ సర్వే

- అత్యవసర పరిస్థితుల్లో తక్షణ సాయానికి ప్రభుత్వం నిర్ణయం



బెంగళూరు, జూన్ 1(ఆంధ్రజ్యోతి): బెంగళూరులో ఇటీవల భారీ వర్షాలతో జనం ఇబ్బంది పడిన అనుభవంతో బీబీఎంపీ అధికారులు డ్రోన్ల ద్వారా సర్వే జరిపేందుకు సిద్ధమయ్యారు. మే నెలలో ఒకేరోజు భారీ వర్షం కురవడంతో లోతట్టు ప్రాంతాలు జలమయం అయ్యాయి. డైరీ సర్కిల్, సర్జాపుర రోడ్డు, పలు చోట్ల ప్రజలు ఇబ్బందిపడ్డారు. భవిష్యత్తులో ఇటువంటి ఇబ్బందులను ముందుగా గుర్తించేందుకు డ్రోన్ల ద్వారా సమాచారం తెలుసుకోదలిచారు. నగరంలో భారీ వర్షాలతో ఇబ్బందులు ఎదురైతే ముందస్తు చర్యలకు రబ్బర్‌బోట్లు, లైఫ్ జాకెట్లను కొనుగోలు చేశారు. వర్షపునీరు నిల్వ ఉండే ప్రాంతాలను గుర్తించే డ్రోన్లు కంట్రోల్ రూంకు సమాచారం ఇవ్వనున్నాయి. ఎక్కడైనా నీరు నిల్వ ఉంటే వాటిని ఎలా మళ్లించాలనేది డ్రోన్ల ద్వారానే సర్వే జరిపించనున్నారు. సమస్య ఏర్పడినప్పుడు ఏ విధంగా చర్యలు చేపట్టాలనేది నిర్ధారిస్తారు. రక్షణా చర్యలు, నీటి మళ్లింపులకు తక్షణం చర్యలు తీసుకునేందుకు వీలుగా డ్రోన్లను ఏర్పాటు చేస్తారు.

తొమ్మిదేళ్ల తర్వాత ఫైనల్‌కు ఆర్‌సీబీ

- గెలిస్తే సెలవు ఇవ్వాలని సీఎంకు వినతి

బెంగళూరు, జూన్ 1 (ఆంధ్రజ్యోతి): ఐపీఎల్ టోర్నీలో రాయల్ చాలెంజర్స్ బెంగళూరు (ఆర్‌సీబీ) జట్టు ఫైనల్స్‌కు చేరడంతో అభిమానుల్లో ఉత్సాహం ఉరకలేస్తోంది. తొమ్మిదేళ్ల తర్వాత ఆర్‌సీబీ ఫైనల్‌కు చేరిందని, జట్టు విజయం సాధిస్తే కర్ణాటక రాష్ట్ర ఆర్‌సీబీ ఫ్యాన్స్ పండుగ పేరిట సెలవు మంజూరు చేయాలని లేఖ పంపారు. ప్రస్తుతం ఈ లేఖ సోషల్‌మీడియాలో వైరల్ అవుతోంది. తొమ్మిదేళ్ల తర్వాత ఆర్‌సీబీ ఫైనల్స్‌కు చేరిందని ఇది సంతోషించే విషయమన్నారు. జూన్ 3న ఫైనల్స్ మ్యాచ్ ఉందని, కప్ గెలిస్తే ఏటా ఇదే తేదీన ప్రభుత్వ సెలవు మంజూరు చేయాలన్నారు. కర్ణాటక రాజ్యోత్సవాల తరహాలో ఆర్‌సీబీ ఫ్యాన్స్ పండుగ చేసుకునేందుకు అవకాశం ఇవ్వాలని కోరారు. బెళగావి జిల్లాకు చెందిన శివానంద మల్లణ్ణవర్ మే 28న ముఖ్యమంత్రికి లేఖ రాశారు.

కాపలా ఉంటూ..కాజేశారు..

- అసలు దొంగలు నేపాల్ దంపతులే..
- యజమాని తిరుపతి వెళ్లిన సమయంలో భారీ చోరీ
- 2 కిలోల నగలు, లైసెన్స్‌డ్ తుపాకీ, విలువైన సామగ్రి కారులో తరలింపు
- సీసీ టీవీ ఫుటేజీలో తేలిన వైనం

బెంగళూరు, జూన్ 1(ఆంధ్రజ్యోతి): కాపలాదారులే భారీ చోరీకి పాల్పడ్డారు. యజమానులు ఊరికి వెళ్లిందే అదనుగా తమ చేతివాటంతో రూ.కోట్లు కొట్టేశారు. నేపాలీవాసుల చోరీలు నగరంలో పెరుగుతున్నాయి. అరిహంత జ్యువెలర్స్ యజమాని ఇంట్లో భారీ చోరీకి పాల్పడిన నేపాలీ ముఠా సంఘటన మరువకముందే ఓ పారిశ్రామికవేత్త ఇంట్లో బంగారంతోపాటు నగదు, ఇతర వస్తువులను దోచిన సంఘటన చోటు చేసుకుంది. హెచ్ఏఎల్ ప్రాంతం శాస్త్రినగర్‌లో రమేశ్ అనే పారిశ్రామికవేత్త నివసిస్తున్నారు. మూడు నెలలక్రిందట నేపాల్‌కు చెందిన దంపతులు రాజ్, దీపాలు సెక్యూరిటీ పనికోసం చేరారు. నమ్మకంగా ఇద్దరూ పనిచేసేవారు. రమేశ్ కుటుంబీకులు వీరితో సన్నిహితంగా ఉండేవారు. మే 27న రమేశ్ కుటుంబీకులు తిరుపతికి వెళ్లారు. నేపాలీ దంపతులు ఇదే అవకాశంగా భావించారు. అదే రోజు రాత్రి ఇంట్లోని బెడ్రూం తలుపులు బద్దలు కొట్టి రూ.1.70 కోట్లు విలువ చేసే సుమారు 2కేజీల బంగారు ఆభరణాలు, రూ.10లక్షల నగదు, లైసెన్స్ తుపాకీతోపాటు ఇతరత్రా వస్తువులతో రాత్రికి రాత్రే పరారీ అయ్యారు. ఓ కారును బుక్ చేసుకున్నారు. ఇంటి వద్దకు కారు రాగానే బ్యాగులను కారులో తరలించుకువెళ్లారు. 28న ఉదయం రమేశ్ మొబైల్‌లో ఇంటి సీసీటీవీని పరిశీలించారు. సీసీటీవీ ఆఫ్ ఉండడంతో కరెంటు పోయి ఉంటుందని భావించారు. ఎంతసేపటికీ సీసీటీవీ కెమెరా పనిచేయకపోవడంతో పక్కింటివారికి సమాచారం ఇచ్చి ఇంటిని పరిశీలించాలని ఫోన్‌లో కోరారు. ఇంట్లో ఎవరూ లేరని వారు తెలిపిన మేరకు స్నేహితులకు ఫోన్ చేసి వెంటనే ఇంటి వద్దకు రావాలని కోరారు. వారు వచ్చి పరిశీలించగా అన్ని తలుపులు తెరిచే ఉన్నాయి. బెడ్రూంతోపాటు బీరువాల తలుపులు తెరిచి ఉండడాన్ని గుర్తించారు. హుటాహుటిన వెనుదిరిగి వచ్చిన రమేశ్ హెచ్ఏఎల్ పోలీసులకు సమాచారం ఇచ్చారు. సీసీటీవీ ఫుటేజీలను పరిశీలించగా ఇంటివద్దకు ఓ కారు రాగా అందులో బ్యాగులతో సెక్యూరిటీ పనిచేసే నేపాలీ దంపతులు వెళ్లినట్టు గుర్తించారు. నేపాలీ దంపతులకోసం గాలింపులు జరుపుతున్నట్టు హెచ్ఏఎల్ పోలీసులు ఆదివారం తెలిపారు.



చోరీకి పాల్పడిన నిందితులు (సీసీ టీవీ ఫుటేజీ)



కారుపై బ్రహ్మోస్ మిసైల్ నమూనాతో యజమాని



థార్ కారుపై దేశ వీరనారీమణుల చిత్రాలతో రాజేంద్ర దేశాయ్

కార్.. సిందూర్!

- కార్లపై సిందూర్ చిత్రాలతో దేశభక్తి చాటుకుంటున్న యజమానులు
- బెళగామ్‌లో ఆకట్టుకుంటున్న వాహనదారులు

బళ్లారి గాంధీనగర్, జూన్ 1(ఆంధ్రజ్యోతి): దేశవ్యాప్తంగా ఆపరేషన్ సింధూర్ విజయంపై సంబరాలు సాగుతున్న సంగతి తెలిసిందే. కొన్ని చోట్ల తమ పిల్లలకు సింధూర, సింధూరి అంటూ పేర్లు పెట్టుకుని మురిసిపోతున్నారు. బెళగామ్‌లో ఇద్దరు దేశాభిమానులు తమ కార్లపై ఆపరేషన్ సింధూర సాహసాలను ప్రతిభించించే చిత్రాలను అంటించి దేశ భక్తిని చాటుకుంటున్నారు. బెళగామ్‌లోని హైటెక్ మోటార్స్ అండ్ ఆటోమొబైల్ ప్రైవేట్ లిమిటెడ్ మేనేజరింగ్ డైరెక్టర్ రాజేంద్ర దేశాయి తమ హోండా ఎక్స్‌టర్ కారు, బెళగామ్ సామాజిక సేవకులు శజవాచౌగుల్ తమ థర్ కారుపై ఆపరేషన్ సింధూర్ స్టిక్కర్లతో ఆకట్టుకుంటున్నారు. రాజేంద్ర తన కారుపై బ్రహ్మోస్ మిలైల్ మాదిరిగా ఏర్పాటు చేసుకోవడం గమనార్హం. కారుపై ఒక తలుపుకు వింగ్ కమాండ్‌వ్యూమికా సింగ్, మరో డోర్‌కు బెళగామ్ జిల్లా కోడలుగా గర్వంగా చెప్పుకునే కల్నల్ సోఫియా ఖురేషి భావచిత్రాలను అంటించారు. అంతేకాకుండా రాఫెల్ యుద్ధ విమానం, ఐరన్ డోమ్, యుద్ధ ట్యాంకర్ చిత్రాలను అంటించి దేశాభిమానాన్ని చాటుకుంటున్నారు. శివా చౌగులా అనే వ్యక్తి థార్ కారుపై కల్నల్ సోఫియా ఖురేషి, వింగ్ కమాండ్ వ్యోమికా సింగ్ భావచిత్రాలు, ఆపరేషన్ సిందూర్ అంటూ స్టిక్కర్ ఏర్పాటు చేసుకోవడం ఆకట్టుకుంటోంది. పహల్గాంలో ఉగ్రదాడులను ధైర్యంగా ఎదుర్కొన్న సైనికులకు ధన్యవాదాలు తెలిపేందుకే తాము భావచిత్రాలను అంటించామని పేర్కొంటున్నారు. నగరంలో కార్ల వద్ద పలువురు సెల్ఫీలు తీసుకుంటూ హర్షం వ్యక్తం చేస్తున్నారు.



కారు ముందు సెల్ఫీ తీసుకుంటున్న యువతులు

తీర్థహళ్లి వద్ద అడవి దున్న మృతి

- రోడ్డు దాటుతుండగా ఢీకొన్న గుర్తుతెలియని వాహనం



గాయపడి రోడ్డుపై కుప్పకూలిన అడవి దున్న

బళ్లారి, జూన్ 1 (ఆంధ్రజ్యోతి): శివమొగ్గ- చిక్‌మంగళూరు పరిధిలోని తీర్థహళ్లి-శృంగేరి వద్ద రామకృష్ణాపూర్ గ్రామం సమీపంలో శనివారం రాత్రి గుర్తుతెలియని వాహనం ఢీకొని అడవి దున్న మృత్యువాత పడింది. పశ్చిమ కనుమల్లో తిరుగుతూ జీవించే ఈ జంతువుల మంద రోడ్డు దాటుతుండగా అడవిదున్నను పెద్ద వాహనం ఢీ కొట్టింది. ఈ ప్రమాదంలో దున్న తలకు, కాళ్లకు తీవ్రగాయాలు తగిలాయి. దారి దాటుతుండగా ఈ ప్రమాదం జరిగినట్లు గుర్తించిన ఇతర వాహన దారులు అక్కడే ఉండే పోలీసులకు ఫోన్ ద్వారా సమాచారం ఇచ్చారు. పశువైద్యులు, అటవీశాఖ అధికారులు వచ్చి వైద్యం అందించే సమయానికి అడవి దున్న తీవ్ర రక్తస్రావంతో అక్కడికక్కడే మృతి చెందిందని వైద్యులు నిర్ధారించారు. ప్రమాదానికి కారణమైన వాహనం కోసం అధికారులు సోదా చేస్తున్నారు. పశ్చిమ కనుమల్లో పులులు, అడవి దున్నలు, ఇతర అనేక జంతువులు జీవనం సాగిస్తున్నాయి. ఇక్కడ దట్టంగా అడవి, పుష్కలంగా నీరు ఉండడం వల్ల జంతువలు, ఇతర మృగాలు ఇక్కడ వాటి స్థావరంగా జీవనం సాగిస్తున్నాయి. వన్యప్రాణుల రక్షణకు చర్యలు తీసుకోవాలని అధికారులను స్థానికులు కోరుతున్నారు.



దున్న కళేబరం

సంగీత వార్షికోత్సవం

బెంగళూరు, జూన్ 1(ఆంధ్రజ్యోతి): సంగీత మొబైల్స్ 51వ వార్షికోత్సవాన్ని పురస్కరించుకుని సంబరాలు జరిపారు. సంగీత వ్యవస్థాపకుడు నారాయణరెడ్డి ద్వారా టీవీఎస్ ఫైనాన్స్ సంస్థ కేక్ కట్ చేయించి వేడుకలు జరిపింది. టీవీఎస్ ఫైనాన్స్ ఇండియాహెడ్ కుశాల్ చక్రవర్తి, సంగీత ఎండీ సుభాష్‌చంద్ర, డైరెక్టర్ చందురెడ్డిలకు శుభాకాంక్షలు తెలిపారు.



సుభాష్‌చంద్రకు షీల్డు అందజేస్తున్న దృశ్యం

5 నుంచి రాయచూరులో ముంగారు ఉత్సవాలు

- హాజరు కానున్న కర్ణాటక, తెలంగాణ సీఎంలు

రాయచూరు, జూన్ 1(ఆంధ్రజ్యోతి): మున్నూరుకాపు సమాజం ఆధ్వర్యంలో ఏటా ఏరువాక పౌర్ణమి పండుగ సందర్భంగా నిర్వహించే ముంగారు సాంస్కృతి ఉత్సవాలు జూన్ 5 నుంచి 12వ తేదీ వరకు నిర్వహిస్తున్నట్లు ఉత్సవాల గౌరవధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే, మున్నూరుకాపు సమాజం సీనియర్ నాయకుడు ఎ.పాపారెడ్డి తెలిపారు. ఆదివారం నగరంలోని ప్రెస్‌క్లబ్‌లో ఆయన విలేకరుల సమావేశంలో ఉత్సవాల వివరాలు వెల్లడించారు. తొలిరోజు నిర్వహించే భారం లాగే జోడెద్దులు, భారం లాగే పోటీలను సీఎం సిద్ధరామయ్య, తెలంగాణ సీఎం రేవంత్‌రెడ్డి హాజరై ప్రారంభిస్తారన్నారు. జిల్లా ఇంచార్జ్ మంత్రి డాక్టర్ శరణప్రకాశ్ పాటిల్, జిల్లాకు చెందిన మంత్రి ఎస్.ఎస్.భోసరాజు పలువురు ప్రజాప్రతినిధులు, ఎంపీలు, ఎమ్మెల్యేలు, మంత్రులు హాజరవుతారన్నారు. ఐదు రోజుల పాటు నగరంలోని వివిధ ప్రదేశాల్లో ప్రతి రోజు సాయంత్రం సాంస్కృతిక ఉత్సవాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. తొలి రోజు 8వ తేదీన నగరంలోని బసవేశ్వర కాలనీ ఈశ్వర ఆలయంలో, 9వ తేదీన ఐడీఎస్ఎంటీ గార్డన్‌లో 10వ తేదీన వాసవి నగర్ శారదా విద్యానికేతన్ పాఠశాల ఆవరణలో, 11వ తేదీన గద్వాల రోడ్డులోని వీరాంజునయ్య స్వామి కల్యాణ మండపంలో, చివరి రోజు 12వ తేదీన గంజ్ కల్యాణ మండపంలో నిర్వహిస్తామన్నారు. 11వ తేదీ ఏరువాక పండుగను పురస్కరించుకుని తమ కులదైవం మహాలక్ష్మి అమ్మవారి రథోత్సవాన్ని నగర ప్రధాన రహదారిలో శోభాయాత్ర నిర్వహిస్తామన్నారు. కాగా ఉత్సవాల ముగింపు రోజు స్థానిక వ్యవసాయ మార్కెట్ కమిటీ ఆధ్వర్యంలో కుస్తీ పోటీలు నిర్వహిస్తున్నట్లు పాపారెడ్డి వెల్లడించారు. ఈ పోటీల్లో డిల్లీ, పంజాబ్, ఆంధ్రప్రదేశ్, కర్ణాటక రాష్ట్రాలకు చెందిన ఫైల్వాన్‌లు పాల్గొననున్నట్లు తెలిపారు.



తుంగభద్ర నీటి మట్టం : 1633 అడుగులు

	ప్రస్తుతం	గత ఏడాది
నీటి మట్టం (అడుగులు)	1596.35	1,577.40
ఇన్‌ఫ్లో (క్యూసెక్కులు)	23,636	270
ఔట్ ఫ్లో (క్యూసెక్కులు)	263	25
నీటి నిల్వ (టీఎంసీలు)	17.17	3.34

కమల్‌హాసన్ క్షమాపణ చెప్పాలి



ర్యాలీ చేస్తున్న కర్ణాటక రక్షణ వేదిక శివరామ్‌గౌడ్ సంఘం అధ్యక్షుడు రాజన్న, పదాధికారులు

బళ్లారిరూరల్, జూన్ 1(ఆంధ్రజ్యోతి): నగరంలో ఆదివారం రాయల్ సర్కిల్ వద్ద కర్ణాటక రక్షణ వేదిక శివరామ్‌గౌడ సంఘం ఆధ్వర్యంలో నటుడు కమల్‌హాసన్ కన్నడ పట్ల అసభ్యకరంగా మాట్లాడటం పట్ల క్షమాపణ చెప్పాలని భారీ పెద్దఎత్తున ర్యాలీ నిర్వహించి కార్యాలయంలో వినతిపత్రం అందించారు. సంఘం అధ్యక్షుడు రాజన్న మాట్లాడుతూ కన్నడ భాషకు వేల సంవత్సరాల చరిత్ర వుందన్నారు. కమల్‌హాసన్ క్షమాపణ చెప్పాలని, లేనిపక్షంలో కమల్‌హాసన్ సినిమాలను కర్ణాటకలో వ్యతిరేకిస్తామని తెలిపారు. కార్యక్రమంలో కట్టేసూరి సుంకన్న, సంఘం పదాధికారులు పాల్గొన్నారు.

రిటైర్డ్ ఎస్ఐకి సన్మానం



రిటైర్డ్ ఎస్ఐ నాగభూషణంను సన్మానిస్తున్న పీడీహళ్లి పోలీస్ స్టేషన్ సిబ్బంది

బళ్లారిరూరల్, జూన్ 1(ఆంధ్రజ్యోతి): బళ్లారి తాలుకాలోని పరమదేవనహళ్లి పోలీసుస్టేషన్లో విధులు నిర్వహిస్తూ రిటైర్ అయిన ఎస్ఐ నాగభూషణకు స్టేషన్ సిబ్బంది పలు గ్రామాల ప్రముఖులు సన్మానించారు. అసిస్టెంట్ సబ్ ఇన్‌స్పెక్టర్ దుర్గాప్రసాద్ మాట్లాడుతూ నాగభూషణ్ 33 సంవత్సరాలుగా మంచి సేవలందించారని, ఒక పీసీ నుంచి సబ్ ఇన్‌స్పెక్టర్‌గా బళ్లారి నగరంలో ట్రాఫిక్ పోలీస్ స్టేషన్ పీడీఎఫ్ పోలీసు స్టేషన్లో 20 నెలలపాటు పనిచేశారన్నారు. శనివారం సాయంత్రం రిటైర్డ్ సందర్భంగా ఆయనను ఘనంగా సన్మానించారు. పోలీసు సిబ్బంది ప్రభాకర్ రెడ్డి, నరసింహ, నాగేష్, నేత్రావతి, ముత్తమ్మ, రవికుమార్, కుమారస్వామి, కనకరాయ్ రైమాస్ ధారాసింగ్, నాగరాజు, పోలీసు సిబ్బంది అభినందించి సన్మానించారు.

విద్యుత్ తీగ తాకి ఐదు గేదెల మృతి



గేదెల కళేబరాలు

బళ్లారి సిటీ, జూన్ 1(ఆంధ్రజ్యోతి): తాలూకాలోని కరూర్ గ్రామంలో గుంజిన వాగు దగ్గర తెగినపడిన విద్యుత్ తీగను తాకి ఐదు గేదెలు మృతి చెందాయి. ఈ ఘటన జరిగి రెండు రోజులైంది. శనివారం కేపీటీసీఎల్ సిబ్బంది, పోలీసులు సంఘటనా స్థలాన్ని సందర్శించి ప్రమాదాన్ని పరిశీలించారు. గోసబాల గ్రామానికి చెందిన రైతు మీసే గాదిలింగప్పకు చెందిన ఓ గేదెతో సహా మరో నాలుగు గేదెలు చనిపోయాయి. వాటి యజమానుల వివరాలు తెలియాల్సి ఉంది. ఐదు గేదెల విలువ రూ.6లక్షలు ఉంటాయని రైతులు తెలిపారు. సిరిగేరి పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదైంది.

రేషన్ బియ్యం స్వాధీనం

కంప్లి, జూన్ 1(ఆంధ్రజ్యోతి): హగరి, బొమ్మనహాళ్ తాలుకా పరిధిలో ఆదివారం ఉదయం పోలీసులు రేషన్ బియ్యాన్ని స్వాధీనం చేసుకున్నారు. రెండు టన్నుల 430 కిలోలు స్వాధీనం చేసుకున్నామని, వీటి విలువ రూ.84 వేలు ఉండవచ్చన్నారు. అలాగే ఉదయం కొట్టూరు పట్టణంలోని పాల్యం రోడ్డులోని ఎంఆర్‌పీఎల్ పెట్రోల్ బంకు సమీపంలో జనాస్ గూడ్స్ వాహనంలో 24.30 క్వింటాళ్ల రేషన్ బియ్యాన్ని పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. వాహనాలు తనిఖీ చేస్తుండగా గూడ్స్ వాహనంలో ప్రభుత్వ బియ్యం వుండటంతో, వాటిని స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు

గంజాయి స్వాధీనం.. ఇద్దరి అరెస్ట్



గంజాయి స్వాధీనం చేసుకున్న పోలీసులు

బళ్లారిరూరల్, జూన్ 1(ఆంధ్రజ్యోతి): నగరంలోని కౌల్‌బజార్ పోలీస్‌స్టేషన్ పరిధిలో యాసిన్‌సాబ్ వీధిలో పోలీసులు గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. అక్రమంగా గంజాయి అమ్ముతున్నట్లు సమాచారం అందుకున్న పోలీసులు నూర్ మహమ్మద్, మహబూబ్ బాషా అనే ఇద్దరు నిందితులను అరెస్ట్ చేసి 1.785 కిలోల గంజాయిను స్వాధీనం చేసుకున్నారు. కార్యక్రమంలో డీఎస్పీ చంద్రకాంతనందరెడ్డి, సీఐ సుభాష్ చంద్ర, క్రైమ్ సబ్ ఇన్‌స్పెక్టర్ లారెన్స్ పోలీసు సిబ్బంది సోమయ్య, మంజునాథ్, అన్వర్ బాషా, సర్దార్ ముజాహిద్ అలీ వీరేష్, ఉమేష్, రామన్నగౌడ తదితరులు పాల్గొన్నారు.



రథాన్ని లాగుతున్న భక్తులు, ఎర్రితాత స్వామి మూలవిరాట్టు (ఇన్‌సెట్‌లో..)

ఘనంగా ఎర్రితాత స్వామి రథోత్సవం

బళ్లారిరూరల్, జూన్ 1(ఆంధ్రజ్యోతి): ఆంధ్ర, కర్ణాటక సరిహద్దు ప్రాంతంలో చేళగుర్కిలో వెలసిన యర్రితాత స్వామి రథోత్సవాన్ని ఆదివారం కన్నుల పండువగా సాగింది. ఉత్సవానికి ఆంధ్ర, కర్ణాటక నుంచి పెద్దఎత్తున భక్తులు తరలివచ్చి స్వామివారిని దర్శించుకుని రథోత్సవంలో పాల్గొన్నారు. యర్రితాత దేవస్థానం నుంచి ఎదురు బసవన్న దేవాలయం వరకు భక్తజన సందోహం మధ్య రథోత్సవాన్ని లాగి మొక్కులు తీర్చుకున్నారు. రథోత్సవం సందర్భంగా మోకా, పరమదేవనహళ్లి, ఎస్ఐలు, పోలీసు సిబ్బంది బందోబస్తు నిర్వహించారు.

విద్యార్థులు అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలి

- శ్రీకృష్ణదేవరాయ విశ్వవిద్యాలయ రిజిస్ట్రార్ రుద్రేశ్



విద్యార్థులను సత్కరిస్తున్న కర్ణాటక వర్కింగ్ జర్నలిస్ట్ అసోసియేషన్

బళ్లారి సిటీ,జూన్ 1(ఆంధ్రజ్యోతి): విద్యార్థులు అవకాశాలను సద్వినియోగం చేసుకుని ఉన్నతస్థాయికి ఎదగాలని విజయనగరం శ్రీకృష్ణదేవరాయ విశ్వవిద్యాలయం రిజిస్ట్రార్ రుద్రేశ్ సూచించారు. కర్ణాటక వర్కింగ్ జర్నలిస్ట్ అసోసియేషన్ ఆదివారం నగరంలోని పత్రిక భవన్‌లో 2025లో పది, పీయూసీ పరీక్షల్లో ఉత్తీర్ణులైన విద్యార్థులకు ప్రతిభా పురస్కార ప్రదానోత్సవ కార్యక్రమం నిర్వహించారు. ముఖ్య అతిథిగా రిజిస్ట్రార్ పాల్గొని ప్రసంగించారు. పేష్వా సహాయంతో ఈ దేశ రాజ్యాంగ నిర్మాణంలో అంబేడ్కర్ గొప్ప వ్యక్తి అయ్యాడని, తాను కూడా కూలీగా జీవించానన్నారు. తమ గ్రామానికి చెందిన బసవేగౌడ అందించిన ఆర్థిక సహాయంతో ఉన్నత చదువులు పూర్తి చేయగలిగానన్నారు. విద్యార్థులను ప్రోత్సహించిన జర్నలిస్ట్ సంఘాలను ఆయన అభినందించారు. జేకే ట్రస్టు అధిపతి జోళదరాశి తిమ్మప్ప మాట్లాడుతూ విద్య గొప్ప ధన వనరు అని, దొంగతనం విద్య కాదని విద్యార్థుల అవార్డులు వారి భవిష్యత్తుకు కూడా సహాయపడాలన్నారు. పదో తరగతి పరీక్షలు రాసే విద్యార్థులకు పెన్నులు, ప్యాడ్లు అందించడం ద్వారా అవగాహన కల్పించడానికి తమ ట్రస్టు కృషి చేస్తుందన్నారు. కార్యక్రమానికి అధ్యక్షత వహించిన కర్ణాటక వర్కింగ్ జర్నలిస్ట్ అసోసియేషన్ కార్యనిర్వాహక కమిటీసభ్యుడు వీరభద్రగౌడ మాట్లాడుతూ విద్యార్థులను ప్రోత్సహించడానికి తమ సంఘం ఇలాంటి కార్యక్రమాలు నిర్వహిస్తోందన్నారు. 21న చామరాజనగర్‌లోని మలే మాదేశ్వర కొండ ఆలయంలో రాష్ట్రస్థాయి కార్యక్రమం ఉంటుందన్నారు. విద్యార్థులు దివ్యశ్రీ, కాంచన, నాగంబి, అస్మితా చౌదరి, కార్తీక్, సంజన, హేమంత్‌కుమార్, యశ్వంత్‌కుమార్, సహనాను సత్కరించారు. కార్యక్రమంలో కే మల్లయ్య, వెంకోబి, రవికుమార్, గురుశాంత్, ప్రభాకర్, జంబునాథ. వీరేశ్, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

మొబైల్ వీడితేనే చదువులో రాణింపు

- నిరంజన్ ప్రభు మహాస్వామి



సమావేశంలో మాట్లాడుతున్న నిరంజన్‌ప్రభు మహాస్వామీజీ

బళ్లారి సిటీ, జూన్ 1(ఆంధ్రజ్యోతి): విద్యార్థులు మొబైల్ ఫోన్లు వీడి పుస్తకాలు పట్టుకోవాలని, అప్పుడే చదువులో రాణించగలరని కురుగోడు నిరంజన్ ప్రభు మహాస్వామి అన్నారు. ఆదివారం నగరంలోని హొసపేట రోడ్డు అల్లీపుర మహాదేవతాత మఠంలో కర్ణాటక రాష్ట్ర వీరశైవ లింగాయత్ ఉద్యోగుల సంఘం 10వ తరగతి, పియూసీ విద్యార్థులకు ప్రతిభా పురస్కార కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. తల్లిదండ్రులు తమ పిల్లలకు విద్య నేర్పిస్తే సరిపోదని, విలువలను కూడా నేర్పించాలి సూచించారు. లింగాయత్ ఉద్యోగుల సంక్షేమ అభివృద్ధి సంఘం ప్రతి సంవత్సరం ప్రతిభా పురస్కారల కార్యక్రమాన్ని నిర్వహించాలని నిర్ణయించింది. ఇందులో భాగంగా ఈ సంవత్సరం 300మంది విద్యార్థులకు పురస్కారాలు అందించామని సంఘం జిల్లా అధ్యక్షుడు భద్రయ్య తెలిపారు. కార్యక్రమంలో సోమశేఖరయ్య, యశ్వంత్ భూపాల్, ఎంజీ.గౌడ, మహంతేశ్, దరూరు శాంతనగౌడ, సురేఖ మల్లనగౌడ, పంచాయతీ ప్లానింగ్ అధికారి వాగీశ్ శివాచార్యులు, బసప్ప, విశ్వనాథ్ హిరేగౌడ, శివానంద, విరూపాక్షప్ప, అల్లం ప్రశాంత్, సిద్దరామనగౌడ, చన్నబసయ్యస్వామి, వెంకటేశ్‌హెగ్డే, బసవరాజ్, వీరశైవ లింగాయత్ సమాజం ప్రముఖులు పాల్గొన్నారు.

హోసూరమ్మ ఆలయ హుండీ లెక్కింపు

కంప్లి, జూన్ 1 (ఆంధ్రజ్యోతి): విజయనగర జిల్లాలో ప్రసిద్ధిచెందిన హోసూరమ్మ ఆలయంలో ఆదివారం హుండీ ఆదాయాన్ని లెక్కించారు. రూ.98,945 ఆదాయం వచ్చినట్లు దేవదాయ శాఖ అధికారి హనుమంతప్ప తెలిపారు. కార్యక్రమంలో మల్లప్ప శ్రీనివాస్, సిబ్బంది పాల్గొన్నారు.



హుండీ సొమ్ము లెక్కిస్తున్న సిబ్బంది

4న చరంతప్పజ్జ స్వామి వర్ధంతి



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న మహేశ్వరస్వామి

బళ్లారి సిటీ,జూన్ 1(ఆంధ్రజ్యోతి): చరంతప్పజ్జ స్వామి 21వ వర్ధంతి కార్యక్రమం జూన్ 4న తొలిసారిగా బళ్లారిలోని బసవ భవనంలో జరుగుతుందని నందిపుర మఠానికి చెందిన మహేశ్వరస్వామి తెలిపారు. నగరంలోని చక్కెర కరడెప్ప మఠంలో ఆదివారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. జూన్ 4న రేణుకాచార్య,బసవన్నల చిత్రపటంతో జగద్గురు సమక్షంలో నంది కోలు, కుంభం, ఇతర శుభ వాయిద్యాలతో చరంతప్పజ్జ స్వామి చిత్రపటంతో నగరంలోని కనకదుర్గమ్మ ఆలయం నుంచి పార్వతి నగర్‌లోని బసవభవన్ వరకు ఊరేగింపు నిర్వహిస్తారన్నారు. విలేకరుల సమావేశంలో కల్యాణ స్వామి మహేశ్వరస్వామి, శంబులింగ స్వామి, జయప్రకాశ్, మృత్యుంజయ,పంచాక్షరప్ప, గౌరీ శంకర్ చంద్రశేఖర్‌గౌడ, మహాలింగయ్య, దుర్గేశ్, నందీశ్ పాల్గొన్నారు.

ఇందిరా క్యాంటీన్ ప్రారంభం ఎప్పుడో..?

కంప్లి, జూన్1(ఆంధ్రజ్యోతి): పట్టణంలో రూ.లక్షల వ్యయంతో నిర్మించిన ఇందిరా క్యాంటీన్ ప్రారంభం ఎప్పుడు అవుతుందోనని ప్రజలు ఎదురు చూస్తున్నారు. నియోజకవర్గంలో పనులు పూర్తయినా క్యాంటీన్ ప్రారంభం కాక పోవడంతో ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఎమ్మెల్యే క్యాంటీన్ ప్రారంభించి పేదల ఆకలి తీర్చాలని కోరుతున్నారు.



ప్రారంభానికి నోచుకోని ఇందిరా క్యాంటీన్

హోసూరు జోన్

ఎమ్మెల్యే అభిమానుల అన్నదానం

హోసూరు, జూన్ 1(ఆంధ్రజ్యోతి): ఎమ్మెల్యే ప్రకాశ్ పుట్టినరోజును పురస్కరించుకుని అభిమానులు ఆదివారం పలు సామాజిక సేవా కార్యక్రమాలు నిర్వహించారు. బస్టాండ్, నిరుపేదలు ఉండే ప్రాంతాలలో అన్నదానం నిర్వహించారు. కేక్ కట్ చేసి మిఠాయిలు పంపిణీ చేశారు. తళి యూనియన్ కమిటీ మాజీ అధ్యక్షుడు శ్రీనివాసప్ప, శ్రీనివాసమూర్తి, శక్తివేల్, దినేశ్, గురు మునిరాజ్, కుమార్ పాల్గొన్నారు.



అన్నదానం నిర్వహిస్తున్న అభిమానులు

చిన్న పరిశ్రమలకు జీఎస్టీ తగ్గించాలి

హోసూరు, జూన్ 1(ఆంధ్రజ్యోతి): సూక్ష్మ, చిన్న, మధ్యతరహా పరిశ్రమలకు (ఎంఎస్ఎంఈ)లకు జీఎస్టీ 5శాతానికి తగ్గించాలని లఘు ఉద్యోగ్ భారతి వార్షిక సమావేశం డిమాండ్ చేసింది. హోసూరులో లఘు ఉద్యోగ్ భారతి రాష్ట్రస్థాయి వార్షిక కార్యనిర్వాహక సమావేశం సంస్థ జాతీయ కార్యదర్శి ప్రకాశ్ జీ చంద్ర అధ్యక్షతన జరిగింది. సమావేశంలో 2025-27 సంవత్సరానికి కార్యవర్గ పదాధికారులను ఎన్నుకున్నారు. రాష్ట్ర అధ్యక్షుడిగా వర్షేజియన్, ప్రధాన కార్యదర్శి కల్యాణ సుందరం, రాష్ట్ర కార్యదర్శి సెందిల్‌కుమార్, కృష్ణగిరి జిల్లా అధ్యక్షుడిగా శివకుమార్, కార్యదర్శిగా కరుప్పయ్య ఎన్నికయ్యారు. సమావేశంలో పలు అంశాలు తీర్మానించారు. ఉద్యోగుల నైపుణ్యాలను మెరుగు పరచడానికి 10 జిల్లాల్లో కార్యకలాపాలను వేగవంతం చేయడం, పారిశ్రామిక సంస్థల ఫిర్యాదులను పరిష్కరించడానికి రాష్ట్రస్థాయి కమిటీ ఏర్పాటుతోపాటు ఎంఎస్ఎంఈలపై ఉన్న 12శాతం జీఎస్టీని 5శాతానికి తగ్గించాలనే డిమాండ్‌ను ప్రతిపాదించారు. ప్రపంచ వాణిజ్యాన్ని ప్రోత్సహించడానికి విమానాశ్రయ సౌకర్యాలను విస్తరించడం, ఎగుమతి అవకాశాలను సృష్టించడం వంటివి తీర్మానించారు.

రేపు కరుణానిధి జయంతి వేడుకలు

హోసూరు, జూన్ 1 (ఆంధ్రజ్యోతి): కృష్ణగిరి పశ్చిమజిల్లాలో డీఎంకే నేత, మాజీ సీఎం కరుణానిధి జయంతి వేడుకలు ఈనెల 3న జరగనున్నాయి. పార్టీ జిల్లా కార్యదర్శి, హోసూరు ఎమ్మెల్యే ప్రకాశ్ ఒక ప్రకటన విడుదల చేశారు. డీఎంకే నాలుగేళ్ల విజయాలను తెలిపే కరపత్రాన్ని పంపిణీ చేయదలిచారు. కార్పొరేషన్‌లోని 4 ప్రాంతాలలోని 45 వార్డులు, యూనియన్ ప్రాంతాలలోని 179 పంచాయతీలు, డెంకణీకోట, కెలమంగల పట్టణ పంచాయతీలలో మొత్తం 662 స్థలాల్లో పాఠశాల విద్యార్థులకు విద్యా సామగ్రి, వైద్య శిబిరాలు, రక్తదాన శిబిరాలు ఉంటాయన్నారు. మొక్కలు నాటే కార్యక్రమం, పేదలకు సంక్షేమాలు అందించనున్నట్టు తెలిపారు. మాజీ ఎమ్మెల్యేలు, జిల్లా నిర్వాహకులు, కార్యనిర్వాహక కమిటీ సభ్యులు, పార్టీ కార్యకర్తలు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.



వర్షంలోనూ రోడ్లను శుభ్రం చేస్తున్న పౌర సిబ్బంది

ముగిసిన పౌర సిబ్బంది సమ్మె

- నగరంలో 480 టన్నుల చెత్త సేకరణ

బళ్లారి సిటీ, జూన్ 1(ఆంధ్రజ్యోతి): మున్సిపల్ ఉద్యోగులను ప్రభుత్వ ఉద్యోగులుగా ప్రకటించడంతో పాటు పలు డిమాండ్లకు ప్రభుత్వం అంగీకరించడంతో 19 రోజులుగా పట్టణ, స్థానిక సంస్థల ఉద్యోగులు చేస్తున్న సమ్మె శుక్రవారం అర్ధరాత్రి ముగిసింది. శనివారం నుంచి యథావిధిగా విధులకు హాజరయ్యారు. కర్ణాటక రాష్ట్ర పౌర సేవకుల సంఘం 19 డిమాండ్లలో 10 డిమాండ్లను నెరవేరుస్తామని ప్రభుత్వం హామీ ఇచ్చింది. పరిశుభ్రత పనుల్లో నిమగ్నమైనట్లు హొసపేట బ్రాంచ్ అధ్యక్షుడు నాగేంద్రవర్మ తెలిపారు. ఉదయం చెత్త ట్రక్కులు పరిగెత్తడం ప్రారంభించాయి. చాలా చోట్ల చెత్తకుప్పలు గుట్టలుగా పేరుకుపోవడంతో, ఇంటింటికీ వెళ్లి చెత్త సేకరణ ఆలస్యమైంది. హొసపేట నగరంలో ప్రతిరోజు సగటున 120 టన్నుల చెత్తను సేకరిస్తారు. నాలుగు రోజులుగా చెత్తను తీయకపోవడంతో 480 టన్నుల చెత్త పేరుకుపోయింది.

జైలులో జామర్ సమస్యపై బీజేపీ నిరసన



జైలు సూపరింటెండెంట్‌కు వినతి పత్రం ఇస్తున్న బీజేపీ నాయకులు

బళ్లారి సిటీ, జూన్ 1(ఆంధ్రజ్యోతి): నగరంలోని సెంట్రల్‌జైలులో ఏర్పాటు చేసిన మొబైల్ జామర్ సమస్యకు వ్యతిరేకంగా బీజేపీ ఆదివారం నిరసన చేపట్టింది. నగరంలోని కనకదుర్గమ్మ ఆలయ సర్కిల్ వద్ద ఆందోళన చేపట్టిన అనంతరం జైలు చీఫ్‌కు వినతి పత్రం అందజేశారు. నగర మాజీ ఎమ్మెల్యే సోమశేఖర్‌రెడ్డి, పార్టీ జిల్లా అధ్యక్షుడు అనిల్ నాయుడు, కార్పొరేషన్ సభ్యులు హనుమంత గుడిగంటి, హనుమంతప్ప, నగర అధ్యక్షుడు వెంకటేశ్ నిరసనలో పాల్గొన్నారు. జైలులో కొత్త జామర్ ఏర్పాటుతో చుట్టుపక్కల ప్రాంతాల్లో మొబైల్ ఫోన్లు పనిచేయడం లేదని, వాణిజ్య లావాదేవీలకు కష్టంగా మారిందని వ్యాపారులు వాపోతున్నారన్నారు. డిజిటల్ చెల్లింపులు జరగడం లేదని, దీనిగురించి గతంలో ఫిర్యాదులు చేసినా చర్యలు తీసుకోలేదన్నారు. వ్యాపారులకు ఇబ్బంది కలగకుండా చర్యలు తీసుకోవాలని వారు కోరారు.

నేడు సింధనూరు బంద్: రైతు సంఘం



రైతులతో చర్చిస్తున్న తహసీల్దార్ అరుణ్ కుమార్ దేశాయ్

కంప్లి, జూన్ 1(ఆంధ్రజ్యోతి): రైతులు పండించిన జొన్నలు కొనుగోలు చేయకపోతే సోమవారం సింధనూరు బంద్ నిర్వహిస్తామని సంఘ నాయకుడు మహమ్మద్ బాషా తెలిపారు. ఆదివారం గాంధీ సర్కిల్లో అర్ధనగ్న ప్రదర్శన చేపట్టారు. రైతులు ఎన్నో కష్టాలు ఎదుర్కొని పంటలు పండిస్తే కొనుగోలు చేయడానికి ప్రభుత్వాలు ముందుకు రావడం రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారన్నారు. ప్రజాప్రతినిధులు కేవలం ఎన్నికల సమయంలో రైతులకు ఇచ్చిన హామీలు నెరవేర్చకపోవడం దారుణమన్నారు. ఖరీఫ్, రబీ సీజన్లో పండించిన జొన్నలకు ఒక్కో రైతుకు 20 క్వింటాళ్ల కొనుగోలు చేయాలని డిమాండ్ చేశారు. అలాగే గిట్టుబాటు రేట్లు కల్పించాలని, లేనిపక్షంలో సోమవారం సింధనూరు బంద్ చేపడతామని హెచ్చరించారు. పలు గ్రామాల నుంచి రైతుల సంఘాల నాయకులు, రైతులు భారీఎత్తున తరలివచ్చారు.

నాగప్ప ఆలయానికి పోటెత్తిన భక్తులు



అలంకరణలో ఏడుపడగల నాగప్ప, పూజల్లో భక్తులు

కంప్లి, జూన్ 1(ఆంధ్రజ్యోతి): తాలుకాలోని బుక్కసాగర గ్రామ కొండల్లో వెలసిన ఏడుపడగల నాగప్ప ఆలయంలో ఆదివారం షష్ఠి ఆశ్లేషం సందర్భంగా భారీగా భక్తులు తరలివచ్చారు. అర్చకుడు విశ్వనాథ్ సామూహికంగా కుజపూజ, నవగ్రహ పూజ, షష్ఠి పూజ, సర్పదోష పూజలు చేపట్టారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు ఆలయానికి భక్తాదులు పోటెత్తారు. కుక్కే సుబ్రహ్మణ్యం వెళ్లలేని భక్తులు నాగప్ప దేవస్థానానికి వస్తుంటారని అర్చకుడు తెలిపారు.

బక్రీద్‌ను శాంతియుతంగా చేసుకోండి: ఎస్ఐ

సిరుగుప్ప, జూన్ 1(ఆంధ్రజ్యోతి): బక్రీద్ పండుగను శాంతియుతంగా జరుపుకోవాలని డీఎస్పీ వెంకటేష్ సూచించారు. జూన్ 7వ తేదీ బక్రీద్ పండుగ జరుగుతున్న నేపథ్యంలో పోలీస్ స్టేషన్‌లో ఆదివారం శాంతి సభ జరిగింది. ఈ సందర్భంగా సీఐ హనుమంతప్ప, ఎస్ఐ పరశురామ్, టెక్కలకోట సీఐ చందనగోపాల్, సిరిగేరి ఎస్ఐ సద్దామ్, హుస్సేన్, ముస్లిం ప్రముఖులు అబ్దుల్ నబీ, డాక్టర్ మహమ్మద్ అలీ పాల్గొన్నారు.

అధికలోడు వాహనాలపై చర్యలు తీసుకోండి

సిరుగుప్ప, జూన్ 1(ఆంధ్రజ్యోతి): ఓవర్‌లోడుతో వెళ్లే ట్రాక్టర్లపై పోలీసు శాఖ చర్యలు చేపట్టాలని స్థానిక ప్రజలు కోరుతున్నారు. సిరుగుప్ప తాలుకాలో వరిధాన్యం పంట ఎక్కువగా పండించడంతో పొలాల నుంచి రైస్ మిల్లులకు టాంగో ట్రాక్టర్లతో ఓవర్‌లోడుగా వెళ్లడంతో ప్రమాదాలు జరిగిన సంఘటనలు ఎన్నో ఉన్నాయి. ప్రస్తుతం పోలీసు స్టేషన్ ఎదురుగా అధిక లోడుతో వెళుతున్న ట్రాక్టర్‌లోని బస్తాలు కింద పడటంతో ప్రయాణికులు, ప్రజలు ఆందోళన చెందారు. స్థానిక పోలీసు శాఖ అధికారులు ఈ విషయంపై చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.



ట్రాక్టర్ నుంచి కిందపడ్డ బస్తాలు

నేటి ప్రముఖులు

పోర్ట్రైట్ ఆర్టిస్ట్ కే.శే. శంకరనారాయణ కాయ్...

ఇళయరాజా (పుట్టినరోజు)



మేస్ట్రోగా పేరొందిన పద్మ విభూషణ్ గ్రహీత ఇళయరాజా తమిళనాడు రాష్ట్రం తేని జిల్లా పన్నైపురం ప్రాంతంలో జన్మించారు. అసలు పేరు జ్ఞాన దేశి కన్. తనకు 'ఇసైజ్ఞాని' (సంగీత విద్వాంసుడు) బిరుదు ఇచ్చిన కలైజ్ఞర కరుణానిధి కోసం జూన్ 3కు బదులుగా 2న పుట్టినరోజు జరుపు కోవడానికి ఇళయరాజా ఇష్టపడతారు. దేశంలోని ప్రముఖ సంగీతకారులలో ఒకరు. పాశ్చాత్య సంగీతాన్ని మిళితం చేస్తూ దక్షిణాది సినిమాలలో సరికొత్త ఒరవడిని సృష్టించారు. మేస్ట్రో తదితర బిరుదులు పొందారు. తమిళం ప్రధానమైనప్పటికీ తెలుగు, మళయాళ, కన్నడ, హిందీ భాషలలో 1400కు పైగా సినిమాలకు సంగీతాన్ని అందించారు. 7వేలపాటలకు పైగా స్వరకర్త. గేయ రచయిత, గాయకుడు, ఆర్కెస్ట్రేటర్‌గాను రాణించారు. ఐదు జాతీ య అవార్డు, సంగీత నాటక అకాడమీ, పద్మ భూషణ్ సహా పలు పురస్కారాలు అందుకున్నారు. 2022 జూలైలో రాజ్యసభకు నామినేట్ అయ్యారు.

నందన్ నీలేకణి (పుట్టినరోజు)



'పద్మభూషణ్' గ్రహీత నందన్ నీలేకణి 1955 జూన్ 2న బెంగళూరులో జన్మించారు. ఇన్ఫోసిస్ సంస్థ సహ సంస్థాపకులలో ఒకరు. నాన్-ఎగ్జిక్యూటివ్ ఛైర్మన్‌గా వ్యవహరించారు. ఆయన హయాంలో ఇన్ఫోసిస్‌కు మరింత గుర్తింపు వచ్చింది. యూనిక్ ఐడెంటిఫికేషన్ అథారిటీ ఆఫ్ ఇండియా (యూఐడీఏఐ) ఛైర్మన్‌గా ఆధార్‌ను అభివృద్ధి చేశారు. వరల్డ్ ఎకనామిక్ ఫోరమ్‌లో అడ్వైజరీ బోర్డులోను ఉన్నారు. ఐఐటీ బాంబే నుంచి 2019లో గౌరవ డాక్టరేట్ అందుకున్నారు. కాంగ్రెస్ పార్టీలో సభ్యుడైనప్పటికీ క్రియాశీలకంగా లేరు.

మణిరత్నం (పుట్టినరోజు)



'పద్మశ్రీ' గ్రహీత మణిరత్నం 1956 జూన్ 2న మదురైలో జన్మించారు. జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో పేరొందిన సినిమా దర్శకుడు, స్క్రీన్ రైటర్, నిర్మాత. ప్రధానంగా తమిళ సినీరంగంలో ఉన్నా వివిధ భాషలలో సినిమాలు తీశారు. 6 జాతీయ అవార్డులు, 4 ఫిల్మ్‌ఫేర్ ఇతర పురస్కారాలు అందుకున్నారు. 1986లో 'మౌనరాగం' తో గుర్తింపు పొందారు. ఆయన సినిమాలు కళాత్మకంగాను, కమర్షియల్‌గాను విజయవంతం అందుకున్నాయి. ప్రపంచవ్యాప్తంగా పలు ఫిల్మ్ ఫెస్టివల్స్‌లో ఆయన సినిమాలు ప్రదర్శించబడ్డాయి.

స్టీవ్ వా (పుట్టినరోజు)




ఆస్ట్రేలియా దేశానికి చెందిన అంతర్జాతీయ క్రికెటర్ స్టీవ్ వా 1965 జూన్ 2న జన్మించారు. పూర్తి పేరు స్టీఫెన్ రోజర్ వా. మార్క్ వా, స్టీవ్ వాలు కవలలు. 1997 నుంచి 2004 వరకు ఆస్ట్రేలియన్ క్రికెట్ జట్టు కెప్టెన్‌గా కొనసాగారు. మిడిల్ ఆర్డర్ బ్యాట్‌మన్‌గా రాణించారు. 1999లో వరల్డ్‌కప్ సాధనలో ఆయన సాధన ఎంతో ఉంది. 41 విజయాలతో మోస్ట్ సక్సెస్‌ఫుల్ టెస్ట్ కెప్టెన్‌గా నిలిచారు. టెస్టులలో 10వేల మైలురాయి సాధించిన ప్రపంచంలోని 12మంది క్రీడాకారులలో ఒకరు. 2004లో ఆస్ట్రేలియన్ ఆఫ్ ది ఇయర్‌గా నిలిచారు. ఆఫీసర్ ఆఫ్ ది ఆర్డర్ ఆఫ్ ఆస్ట్రేలియా, ఆస్ట్రేలియన్ స్పోర్ట్స్ మెడల్ పురస్కారాలు అందుకున్నారు. అంతేకాక సామాజిక సేవా కార్యక్రమాలకు చేయూత అందిస్తున్నారు.

లలితా బాబర్ (పుట్టినరోజు)



లలితా బాబర్ 1989 జూన్ 2న మహారాష్ట్రలోని సతారా జిల్లా మోహి ప్రాంతంలో జన్మించారు. లాంగ్‌డిస్టన్స్ రన్నర్‌గా రాణించి 'అర్జున' పురస్కారంతో జాతీయ గుర్తింపు పొందారు. 2005లో అండర్-20 విభాగంలో పూనెలో నిర్వహించి జాతీయ చాంపియన్ పోటీలలో ఆమె బంగారుపతకం సాధించారు. 3వేల మీటర్లలో సత్తా చాటుకోవడంతోపాటు 2014లో ముంబై మారథాన్‌లో హ్యాట్రిక్ విన్నర్‌గా నిలిచారు. కొరియాలో 2014 ఏషియన్ గేమ్స్‌లో కాంస్య పతకం, బీజింగ్‌లో 2015లో బంగారు పతకం అందుకున్నారు. 2020లో స్పోర్ట్స్‌కోటాలో రాయ్‌ఘడ్ జిల్లా మనగావ్‌లో తహసీల్దార్‌గా నియమితులయ్యారు. ఇతర పురస్కారాలు పొందారు.

రాజ్‌కపూర్ (వర్ధంతి)



'పద్మభూషణ్' గ్రహీత రాజ్‌కపూర్ 1942 డిసెంబరు 14న పెషావర్‌లో (ప్రస్తుతం పాకిస్థాన్‌లో ఉంది) జన్మించారు. అసలు పేరు సృష్టినాథ్ కపూర్. హిందీ సినిమా రంగంలో నటుడు, నిర్మాత, దర్శకుడు. ఆయన రూపొందించిన సినిమాలు దేశంలోనే కాక ఆసియా, యూరప్ వ్యాప్తంగా ప్రజాదరణ పొందాయి. 'చార్లీచాప్లిన్ ఆఫ్ ఇండియన్ సినిమా' గా పేరొందారు. 5 జాతీయ, 11 ఫిల్మ్‌ఫేర్, దాదా సాహెబ్‌ఫాల్కే అవార్డు అందుకున్నారు. 1988 జూన్ 2న కన్నుమూశారు.

టైర్ల దుకాణంలో అగ్ని ప్రమాదం

బెంగళూరు, జూన్ 1(ఆంధ్రజ్యోతి): నగరంలో నిత్యం రద్దీగా ఉండా జేసీనగర్ టైర్ల దుకాణంలో అకస్మికంగా అగ్ని ప్రమాదం చోటు చేసుకుంది. ఆదివారం ఉదయం నుంచి అగ్నిమాపక సిబ్బంది మంటలు ఆర్పడంలో విశేష కృషిచేశారు. నష్టం అంచనా వేయడం సాధ్యం కాలేదు.



మంటలు ఆర్పుతున్న సిబ్బంది

ఉన్నత లక్ష్యంతో చదవండి

» పీయూ తరగతుల ప్రారంభోత్సవంలో పీఈఎస్ చాన్స్‌లర్

బెంగళూరు, జూన్ 1 (ఆంధ్రజ్యోతి): ప్రతి విద్యార్థికి పదో తరగతిలో వచ్చే మార్కులు కీలకమని, పీయూలో ఒక లక్ష్యంతో చదివితే ఆ తర్వాత సులభతరంగా ఉన్నతస్థితికి చేరవచ్చునని పీఈఎస్ యూనివర్సిటీ చాన్స్‌లర్ ప్రొఫెసర్ జవహర్ దొరస్వామి అభిప్రాయపడ్డారు. పీయూసీ ప్రథమ సంవత్సరం తరగతులను ఆదివారం లాంఛనంగా ప్రారంభించారు. గత ఏడాది ఉత్తమ మార్కులు సాధించిన విద్యార్థులకు ప్రత్యేకంగా సత్కరించారు. ఈ సందర్భంగా విద్యార్థులను ఉద్దేశించి జవహర్ మాట్లాడుతూ నిరంతరం కొత్త ఆలోచనలతో చదువుకునే వాతావరణం కల్పించడం పీఈఎస్ లక్ష్యంగా పెట్టుకుందన్నారు. విద్యార్థులు క్రమశిక్షణ, నిరంతరం చదువు పట్ల ధ్యాస, మంచి అలవాట్లతో ముందుకెళ్లాలన్నారు. మెంటార్ సిస్టమ్ అమలు చేస్తున్నామని ఎటువంటి సందేహాలైనా అధ్యాపకులతో నివృత్తి చేసుకోవచ్చునన్నారు. వైస్‌చాన్స్‌లర్ డాక్టర్ సూర్యప్రసాద్ మాట్లాడుతూ విద్యార్థుల శ్రమ ఉన్నతస్థితికి తీసుకెళ్తుందన్నారు. సాంకేతిక విధానాలతో ఎటువంటి సందేహాలైనా నివృత్తి చేసుకోవచ్చునని, అయితే మొబైల్ వాడకం ద్వారా సోమరులతోపాటు వాటికి బానిసలయ్యే అవకాశాలు ఉంటాయని, అందుకే సాంకేతిక పరిజ్ఞానాన్ని సక్రమ మార్గంలో వినియోగించు కోవాలన్నారు. 2024-24 విద్యాసంవత్సరంలో ఉత్తమ మార్కులు సాధించిన 73మంది విద్యార్థులు వారు చెల్లించిన ఫీజులో 25శాతం ప్రోత్సాహకం రూపంలో అందించారు. హనుమంతనగర్ క్యాంపస్ డైరెక్టర్ ప్రొఫెసర్ ఎంవీ సత్యనారాయణ, ప్రిన్సిపాల్ డాక్టర్ సీ నారాయణరెడ్డితోపాటు విద్యార్థుల తల్లిదండ్రులు ఉన్నారు.



ప్రోత్సాహకాలతో విద్యార్థులు, చాన్స్‌లర్ జవహర్ తదితరులు

మహాపద్మానంద జాతీయ సదస్సు



సదస్సుకు వచ్చిన వివిధ రాష్ట్రాల ప్రతినిధులు

బెంగళూరు, జూన్ 1(ఆంధ్రజ్యోతి): కులం ఒక్కటే అయినా దేశవ్యాప్తంగా వివిధ పేర్లతో పిలిచే మహాపద్మానంద కమ్యూనిటీ సమిష్టిగా ముందుకెళ్లాల్సిన అవసరం ఉందని తీర్మానించారు. నగరంలోని గాంధీభవన్‌లో జాతీయస్థాయి మహాపద్మానంద కమ్యూనిటీ ఎడ్యుకేటెడ్ అసోసియేషన్ రెండు రోజుల చర్చాగోష్టి ఆదివారం ముగిసింది. జాతీయ అధ్యక్షుడు రాంశీల్ శర్మ సీనియర్ వైస్‌ప్రెసిడెంట్ అవధో రాజ్‌నంద్, జనరల్ సెక్రటరీ లాడు సురోలర్కర్, అడిషినల్ జాయింట్ సెక్రటరీ హరిద్వారి లాల్రె, జాయింట్ సెక్రటరీ సతీశ్‌శైన్ ఆధ్వర్యంలో చర్చాగోష్టులు జరిగాయి. కర్ణాటకలో సవితా సమాజగా పిలిచే సంప్రదాయం ఉందని, అదే తరహాలోనే ఉత్తరభారత్‌లో ప్రాంతాలవారీగా వేర్వేరు పేర్లతో పిలుస్తారని రాంశీల్‌శర్మ అభిప్రాయపడ్డారు. జాతీయస్థాయిలో ఒక కూటమి ఏర్పాటు చేయాలనే ప్రాంతాలవారీగా సదస్సులు నిర్వహిస్తున్నామన్నారు. బెంగళూరులో నిర్వహిస్తున్న నాల్గో జాతీయసదస్సుకు 12 రాష్ట్రాలనుంచి ప్రతినిధులు పాల్గొన్నారన్నారు. మహిళా కమిటీల తరపున భాగస్వామ్యులు కావడం సంతోషంగా ఉందన్నారు. జాతీయస్థాయిలో కులగణన వేళ ప్రజలలో చైతన్యం తీసుకురాదలిచారు. 2017లో ఏర్పాటు చేసిన రోహిణి కమిషన్ నివేదిక అమలు చేయాలని డిమాండ్ చేశారు. చలో గ్రామ్‌కి పోర్‌లో భాగంగా ఎన్నికల్లో పోటీ చేయాలని తీర్మానించారు. దేశవ్యాప్తంగా జరుగుతున్న హత్యలు, వివాహేతర సం బంధాలు కుటుంబాలను విచ్ఛిన్నం చేస్తాయని, అవగాహన ఉండాలని తీర్మానించారు. సంఘానికి సంబంధించి ఎటువంటి ప్రచారమైనా నిబం ధనలు పాటించాలన్నారు. కేంద్ర కార్యాలయం ఏర్పాటు, సంఘం చరిత్రను పునః పరిశీలించి తప్పులను సరిచేయడం, ఐటీ సెల్ ఏర్పాటు, వెబ్ ఆధు నీకరణ చేయాలని తీర్మానించారు. పదాధికారులకు జీవితకాలం సభ్యత్వం ఉండాలని తెలిపారు. కర్ణాటక, తెలంగాణతోపాటు ఉత్తరభారత్‌కు చెందిన పలు రాష్ట్రాల ప్రతినిధులు పాల్గొన్నారు. నందయుగ్ పత్రిక చీఫ్ ఎడిటర్ ఎస్‌పి పినన్, విష్ణుసేన్, డాక్టర్ శివమూర్తితోపాటు తెలంగాణ నుంచి సుద ర్శన్, నారు తదితరులు పాల్గొన్నారు. జాతీయ కమిటీ పలు తీర్మానాలు చేసింది.

గ్లోబల్ సమ్మేళనంపై సన్నాహక సభ

బెంగళూరు, జూన్ 1(ఆంధ్రజ్యోతి): గ్లోబల్ ఆర్యవైశ్య సమ్మేళనం నిర్వహించడం ద్వారా ఆర్యవైశ్య సముదాయ సమగ్ర అభివృద్ధికి బాటలు కానుందని రాష్ట్ర బయో ఇంధన వనరుల అభివృద్ధి మండలి అధ్యక్షులు ఎస్ఈ సుధీంద్ర అభిప్రాయపడ్డారు. సమ్మేళనం ఏర్పాటుకు సంబంధించి నగరంలో ఆదివారం కర్ణాటక ఆర్యవైశ్యమహాసభ కార్యాలయంలో సన్నాహసభ నిర్వహించారు. కర్ణాటక ఆర్యవైశ్య మహాసభ అధ్యక్షుడు ఆర్‌పీ రవిశంకర్, పాలకవర్గం సభ్యులు పాల్గొన్నారు. గ్లోబల్‌స్థాయిలో నిర్వహించే సమ్మేళనంలో వివిధ దేశాలలో ఉన్న సామాజికవర్గీయులు పాల్గొంటారని, ఐకమత్యం చాటేందుకు సాధ్యమవుతుందని అభిప్రాయపడ్డారు. ఆర్యవైశ్య సముదాయ ప్రగతికి ముఖ్యమంత్రి సిద్దరామయ్య నేతృత్వంలోని కర్ణాటక ప్రభుత్వం అన్ని విధాలా సహకారం అందిస్తోందన్నారు. ఇదే సందర్భంగా రాష్ట్ర బయో ఇంధన పాలసీ 2025-30 గురించి ప్రస్తావించారు. సంప్రదాయేతర వనరుల రంగంలో పెట్టుబడులు పెట్టేవారికి పలు రాయితీలు, ప్రోత్సాహకాలు ఉన్నాయని వివరించారు. సన్నాహకసభలో పలువురు తమ అభిప్రాయాలు వ్యక్తం చేశారు.



సన్నాహక సభలో రాష్ట్ర బయో ఇంధన వనరుల అభివృద్ధి మండలి అధ్యక్షుడు ఎస్ఈ సుధీంద్ర, ఆర్‌పీ రవిశంకర్ తదితరులు

గ్రామాభివృద్ధికి పాటుపడతా

» నూతన ఉపాధ్యక్షుడు మంజునాథ్ సర్జా



మంజునాథ్ సర్జాను అభినందిస్తున్న స్థానికులు

దొమ్మసంద్ర, జూన్ 1(ఆంధ్రజ్యోతి): బెంగళూరు నగరానికి కూతవేటు దూరంలో ఉన్న సర్జాపుర గ్రామపంచాయతీ ఎంతో అభివృద్ధి చెందుతోందని, ప్రభుత్వ పథకాలు ప్రజల ఇంటి చెంతకు చేరే కార్యక్రమాలు అందించబడ్డాయని, ప్రధానంగా మౌలిక సదుపాయాలకు ప్రాధాన్యత ఇస్తున్నట్టు సర్జాపుర గ్రామపంచాయతీ ఉపాధ్యక్షుడు డాక్టర్ ఎస్ మంజునాథ్ సర్జా అభిప్రాయపడ్డారు. సర్జాపుర గ్రామపంచాయతీ కార్యాలయంలో ఏర్పాటైన నూతన ఉపాధ్యక్ష పదవీబాధ్యత కార్యక్రమంలో పాల్గొని మీడియాతో మాట్లాడారు. సర్జాపుర గ్రామ పంచాయతీలో 30 సభ్యులు ఉన్నారని, అందరి విశ్వాసంతో ఏకగ్రీవమైనట్టు తెలిపారు. పంచాయతీ అభివృద్ధికి అందరి సహకారం తీసుకుంటానన్నారు. ప్రత్యేకించి కాంగ్రెస్ అధికారంలో ఉండడంతో పార్టీ అమలు చేస్తున్న గ్యారంటీ పథకాలు మరింతమందికి చేరువ అయ్యేలా కృషి చేస్తానన్నారు. కేపీసీసీ కార్మిక విభాగం కార్యదర్శి ఎస్ రమేశ్, సర్జాపుర గ్రామపంచాయతీ మాజీ అధ్యక్షుడు శంభయ్య, ఎస్ఎం శ్రీనివాస్, బుడగప్ప, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు మంజేగౌడ, ఇతర ప్రముఖులు తదితరులు ఆయనను అభినందించారు.

మళమాచనహళ్లి డెయిరీ ప్రగతి బాట

శిడ్లఘట్ట, జూన్ 1(ఆంధ్రజ్యోతి): చిక్కబళ్లాపుర, కోలారు జిల్లాల్లో మళమాచన హళ్ళి డెయిరీ పాలసేకరణలో మొదటిస్థానంలో ఉంది. ప్రతి రోజూ 3,200 లీటర్ల పాలు సేకరిస్తారు. డెయిరీ ప్రతి నెలా రూ.40లక్షల రూపాయల లావాదేవీలు చేస్తూ వందలాది కుటుంబాలు జీవనం సాగిస్తున్నాయి. ఈ డెయిరీకి పలు పురస్కారాలు లభించాయి. జూన్ 1న ప్రపంచ పాల దినోత్సవం ఆచరిస్తుంది. పుట్టిన శిశువు నుంచి వృద్ధుడి వరకు పాలు తాగడం ద్వారా ఆరోగ్యానికి సహకరిస్తోంది. పట్టు రంగంలో పేరొందిన శిడ్లఘట్టకు మళమాచనహళ్ళి డెయిరీ ఒక గర్వకారణంగా ఉంది. 1970లో ప్రారంభమైన డెయిరీ దినదినాభివృద్ధి చెందింది. సుమారు 500 కుటుంబాలు సహా 300 కుటుంబాలు పాడి పరిశ్రమపై ఆధారపడ్డాయి. కేఎంఎఫ్ ద్వారా పాడిరైతులకు క్రమం తప్పకుండా ఫీడ్, నెయ్యి, మినరల్ మిక్చర్, జొన్న తదితర సామగ్రి అందిస్తోంది. మళమాచనహళ్ళి పాల ఉత్పత్తిదారుల సహకార సంఘం అధ్యక్షుడు సతీశ్ మాట్లాడుతూ కోలారు, చిక్కబళ్ళాపుర జిల్లాల్లో అత్యధిక పాలు అందిస్తున్న సంఘం కావడం గర్వకారణమన్నారు. అందరి సహకారంతో మరింత పురోగతి సాధ్యమన్నారు.



డెయిరీలో పాలు పోస్తున్న రైతులు

పౌరకార్మికుల సమస్యలను పరిష్కరించాలి



నగరసభ కార్యాలయం వద్ద ధర్నా చేస్తున్న పౌరకార్మికులు

ముళబాగిలు, జూన్ 1(ఆంధ్రజ్యోతి): వివిధ డిమాండ్లను పరిష్కరించాలని కోరుతూ కర్ణాటక రాష్ట్ర పౌరసేవా ఉద్యోగుల సేవాసంఘం తాలూకా శాఖ ఆధ్వర్యంలో నగరసభ కార్యాలయం ముందు నిరవధిక ధర్నా చేపట్టారు. రాష్ట్రప్రభుత్వ ఉద్యోగులకు కల్పిస్తున్న సౌకర్యాలను వర్తింప చేయాలని పౌరకార్మికులు డిమాండ్ చేశారు. రాష్ట్రంలోని నగర స్థానిక సంస్థ లలోని దినకూలీ, క్షేమాభివృద్ధి నిబంధనలకింద నియమితులైన వారిని పర్మనెంట్ చేయాలన్నారు. 2020 ప్రత్యేక నియమావళి కింద ఎంపికైన పౌరకార్మికులు, లోడర్‌లను ఎస్ఎఫ్‌సి స్కేల్‌ను వర్తింపచేయాలన్నారు. జ్యోతి సంజీవిని పథకం/ నగదు రహిత చికిత్సా సౌలభ్యాన్ని కల్పించాలని డిమాండ్ చేశారు. ధర్నాకు నగరసభ ప్రజాప్రతినిధులు, బీజేపీ నాయకులు మద్దతు ఇచ్చారు. పౌరకార్మికుల సంఘం రాష్ట్ర అంతరిక సలహాదారుడు ఎస్ వెంక టేశప్ప, కోలారు జిల్లాధ్యక్షుడు నారాయణస్వామి, తాలూకా శాఖ అధ్యక్షుడు మునివెంకటప్ప తదితరులు పాల్గొన్నారు.

బడిని బాగు చేయరూ..

చేళూరు, జూన్ 1(ఆంధ్రజ్యోతి): సరిహద్దు ప్రాంతమైన చేళూరు తాలూకా పరిధిలో 12 గ్రామపంచాయతీలలో సుమారు 200 గ్రామాలు ఉన్నాయి. అందరికీ విద్య అందించాలనే లక్ష్యంతో ప్రభుత్వం ప్రాథమిక పాఠశాలలు ఏర్పాటు చేసినా చాలాచోట్ల మౌలిక సదుపాయాలు లేవు, ఉపాధ్యాయుల కొరత ఉంది. ఈ కారణాలతో తల్లిదండ్రులు ప్రైవేట్ పాఠశాలల పట్ల మొగ్గు చూపుతున్నారు. కొన్నిచోట్ల ప్రైవేట్‌కు దీటుగా ప్రభుత్వ పాఠశాలలు కొనసాగుతున్నాయి. ఏది ఏమైనా ప్రభుత్వ పాఠశాలలు పూర్తిస్థాయి మనుగడ సాధించాలంటే వాటిని మరింత అభివృద్ధి చేయాల్సిన అవసరం ఎంతైనా ఉంది. కొన్ని చోట్ల పాఠశాల తరగతి గదులు దుస్థితిలో ఉండగా మరికొన్ని స్వల్ప మరమ్మతులు చేయాల్సి ఉంది. వేసవి సెలవులు ముగిసి తాజాగా విద్యాసంవత్సరం ప్రారంభమైంది. ఈ దిశగా ఉన్నతాధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలని గ్రామస్థులు, ఉపాధ్యాయులు కోరుతున్నారు. చేళూరు, ఏనిగదలె, చిలకలనేర్పు, చాకవేలు, బురడగుంటపాళ్య, నారెమద్దెపల్లి, సోమనాథపురం, పులగల్లు, రా చెరువు తదితర గ్రామాలలో ప్రాథమికోన్నత, మరికొన్ని చోట్ల హైస్కూళ్లు ఉన్నాయి. చాలా పాఠశాలల్లో శౌచాలయాల కొరత ఉంది. ప్రధానంగా ఈ సమస్యను పరిష్కరించాలని, ఇతర మౌలిక సదుపాయాలు కల్పించాలని విద్యార్థులు, తల్లిదండ్రులు కోరుతున్నారు.



దెబ్బతిన్న పాఠశాల గోడ

రూ.13.73 లక్షల చోరీసొత్తు స్వాధీనం

బంగారపేట, జూన్ 1(ఆంధ్రజ్యోతి): తాలూకాలోని కామసముద్రం పోలీసులు వివిధ కేసు ల్లో నలుగురు అంతరాష్ట్ర నిందితులను అరెస్టు చేసి వారి నుంచి రూ.13.73 లక్షల విలు వైన చోరీసొత్తును స్వాధీనం చేసుకున్నారు. దొడ్డపన్నాండహళ్లిలో 2 సీమ ఆవులు, 4 గొర్రెల చోరీ కేసులో నిందితులను అరెస్టు చేశారు. డీఎస్పీ పాండురంగ, సీఐ జేసీ నారాయణస్వామి మార్గదర్శకంలో కామసముద్రం ఎస్ఐ కిరణ్‌కుమార్ నేతృత్వంలో ప్రత్యేక బృందాన్ని ఏర్పాటు చేశారు. తనిఖీల వేళ పశువులను అక్రమంగా తరలిస్తున్న చిత్తూరు జిల్లా వాసి సురేశ్ (34), తమిళనాడు రాష్ట్రంలో కృష్ణగిరి జిల్లా వాసి సతీశ్ (34), రూపేశ్ (28), వెంకటరమణప్ప (34) లను అరెస్టు చేశారు. వీరివల్ల వేర్వేరు స్టేషన్‌లలోని 5కేసులు కొలిక్కి వచ్చాయన్నారు. ఒక ట్రాక్టర్, ట్రాలీ, 3 సీమ ఆవులు, నాలుగు గొర్రెలు, 32 పందులు, రూ.3,200 నగదు, పశువులను తరలించేందుకు ఉపయోగించిన బొలెరో పికప్ వాహనం స్వాధీనం చేసుకున్నారు. కేసును ఛేదించిన పోలీసులను జిల్లా ఎస్పీ కేఎం కాంతరాజు అభినందించారు.

ఖర్గేతో మంత్రి లక్ష్మీహెబ్బాళ్కర్ భేటీ



మల్లికార్జున ఖర్గేకు పుష్పగుచ్ఛం అందజేస్తున్న మంత్రి లక్ష్మీ హెబ్బాళ్కర్

బెంగళూరు, జూన్ 1 (ఆంధ్రజ్యోతి): ఏఐసీసీ అధ్యక్షులు మల్లికార్జున ఖర్గేను రాష్ట్ర స్త్రీ శిశుసంక్షేమశాఖ మంత్రి లక్ష్మీ హెబ్బాళ్కర్ భేటి అయ్యారు. ఆదివారం సదాశివనగర్‌లోని ఖర్గే నివాసానికి వచ్చిన లక్ష్మీ హెబ్బాళ్కర్ సుదీర్ఘ సమయం చర్చలు జరిపారు. అనంతరం లక్ష్మీ హెబ్బాళ్కర్ మీడియాతో మాట్లాడుతూ పార్టీ అధ్యక్షులు ఖర్గేను కలవడంలో ప్రత్యేకత లేదని, మర్యాదపూర్వకంగా భేటీ అయినట్టు తెలిపారు. మా పార్టీలో సీనియర్ నేత, కీలక హోదాలో ఉన్నవారన్నారు. పలు రాజకీయ అంశాలు చర్చకు వచ్చాయన్నారు. అవి ప్రాధాన్యతపరమైనవి కాదన్నారు. ఢిల్లీ వెళ్లినప్పుడు ఖర్గేను కలవాలని భావించానని, కానీ బిజీగా ఉండడం వల్ల సాధ్యం కాలేదన్నారు. బెంగళూరులో ఉన్నారనే సమాచారంతో భేటీ అయ్యానన్నారు. గ్యారంటీ పథకాలపై ఖర్గే అడిగి తెలుసుకున్నారన్నారు. అర్హులైనవారికే గృహలక్ష్మి అందుతోందా అని ఆరా తీశారన్నారు.

విద్యార్థులు కొత్త ఆలోచనలతో ముందుకెళ్లాలి

» రచయిత డాక్టర్ కేపీ పుత్తురాయ



తరగతులను ప్రారంభిస్తున్న డాక్టర్ కేపీ పుత్తురాయ తదితరులు

బెంగళూరు, జూన్ 1(ఆంధ్రజ్యోతి): విద్యార్థులు కొత్త ఆలోచనలతో ముందుకెళ్లాలని ప్రముఖ రచయిత డాక్టర్ కేపీ పుత్తురాయ అభిప్రాయపడ్డారు. కమ్మవారి సంఘం ఆధ్వర్యంలోని పీయూ కళాశాలలో తరగతులను ఆదివారం ప్రారంభించారు. పుత్తురాయ మాట్లాడుతూ ప్రతి విద్యార్థికి పీయూ కీలకమైనదన్నారు. భవిష్యత్తు ఉత్తమంగా ఉండాలంటే క్రమశిక్షణతో చదవాలన్నారు. సలహా కమిటీ సభ్యులు కే కృష్ణ ముఖ్య అతిథిగా పాల్గొని ప్రథమ, ద్వితీయ సంవత్సరంలో ఉత్తమమార్కులు సాధించిన విద్యార్థులను సత్కరించారు. కళాశాల పాలకమండలి గౌర వాధ్యక్షుడు రాజగోపాలనాయుడు, కార్యదర్శి లీలాశంకరరావు, కోశాధికారి నీరజాక్షులు నాయుడు, తులసిపతినాయుడు, ప్రిన్సిపాల్ గిరీశ్‌బాబు తదితరులు పాల్గొన్నారు.

సర్కారు బడిలో కుమారుడిని చేర్చిన న్యాయమూర్తి



న్యాయమూర్తి కుమారుడిని స్వాగతిస్తున్న ఉపాధ్యాయ బృందం

బెంగళూరు, జూన్ 1(ఆంధ్రజ్యోతి): ప్రైవేట్ పాఠశాలలో పిల్లలను చేర్పేందుకు అందరూ ఆసక్తి చూపుతారు. తుమకూరు జిల్లా శిరాలోని సీనియర్ సివిల్ కోర్టు న్యాయమూర్తి తన కుమారుడిని ప్రభుత్వ కన్నడ మోడల్‌స్కూల్‌లో చేర్పారు. విద్యాసంవత్సరం ప్రారంభమైన తరుణంలో న్యాయమూర్తి జరీఫాబాను కుమారుడు అజాద్ ఆర్జడ్‌ను ఐదోతరగతిలో చేర్పారు. విద్యాశాఖ అధికారి కృష్ణప్ప, హెడ్మాస్టర్ నరసింహయ్య తదితరులు విద్యార్థిని సాదరంగా స్వాగతించారు.

సైక్లింగ్‌తో ఆరోగ్యం..



సైక్లింగ్‌లో పాల్గొన్న మాజీ కార్పొరేటర్ నాగరాజు

బెంగళూరు, జూన్ 1(ఆంధ్రజ్యోతి): సైక్లింగ్ చేయడం ద్వారా ఆరోగ్యం సాధ్యమని మాజీ కార్పొరేటర్ నాగరాజు అభిప్రాయపడ్డారు. ప్రపంచ బైసికల్ డే, ప్రపంచ పర్యావరణ దినోత్సవం పురస్కరించుకుని బీఎన్ఎం విద్యాసంస్థల ఆధ్వర్యంలో ఆదివారం ప్రత్యేక కార్యక్రమం నిర్వహించారు. యువత, విద్యార్థులు సైకిల్ తొక్కుతూ పాల్గొన్నారు. వందలాదిమంది ర్యాలీలో పాల్గొన్నారు. వికాసనా ఫౌండేషన్ ముఖ్యులు హరిప్రసాద్ పాల్గొన్నారు.

ప్రతిరోజూ సైక్లింగ్ చేయాలి : ఎస్పీ

రాయచూరు, జూన్ 1 (ఆంధ్రజ్యోతి): ప్రతిరోజు సైక్లింగ్ చేయడం ద్వార ఆరోగ్య రక్షణకు ఎంతో ఉపయుక్తంగా ఉంటుందని జిల్లా ఎస్పీ పుట్టమాదయ్య అన్నారు. జిల్లా సైక్లింగ్ అసోసియేషన్ ఆధ్వర్యంలో తిరంగ సైకిల్ ర్యాలీ పేరుతో ఆదివారం నగరంలో సైక్లింగ్ ర్యాలీ నిర్వహించారు. ప్రపంచ సైక్లింగ్ దినోత్సవాన్ని పురస్కరించుకుని ఏర్పాటు చేసిన ఈ ర్యాలీని జిల్లా ఎస్పీ పుట్టమాదయ్య ప్రారంభించి మాట్లాడారు. గతంలో విరివిగా సైక్లింగ్‌ళ్లు వాడడం వల్ల అనేక మంది అనారోగ్యానికి దూరంగా ఉండేవారని గుర్తు చేశారు. ఇటీవల కాలంలో వాహనాల వినియోగం పెరిగిన నేపథ్యంలో శారీరక వ్యాయామం తగ్గిపోయిందన్నారు. సైక్లింగ్ వల్ల శారీరక వ్యాయామం జరగడంతో పాటు పలు ఆరోగ్య పరంగా లబ్ది ఉంటుందన్నారు. ఈ విషయంలో సైక్లింగ్ రన్ అసోసియేషన్ ప్రతినిధులను ఎస్పీఅభినందించారు.